

భోజనశాల, ఆర్ఓ ప్లాంట్ల వద్ద పరిశుభ్రత పాటించాలి

ట్రిపుల్ ఐటీలో భోజనశాల, ఆర్ఓ ప్లాంట్ల వద్ద పరిశుభ్రత పాటించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయకుమార్ సూచించారు. - 8లో



జీఓ 145ను రద్దు చేయండి

రాష్ట్రంలో కోర్టులను తగ్గించేందుకు తీసుకొస్తున్న జీఓ నంబర్ 145ను రద్దు చేయాలని రాయచోటి కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.140

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 125 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ప్రత్యేక కార్యాచరణతో జిల్లా అభివృద్ధి

రాయచోటి : వినూత్న ఆలోచనలు, ప్రత్యేక కార్యాచరణతో జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల సమావేశానికి అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జేసీ జిల్లా స్థాయి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులందరూ కార్యాచరణ రూపొందించుకొని నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

రాయచోటి (జగదాంబసెంటర్) : జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, జూనియర్ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ పాటించాలని ఆదేశించారు.

వేగంగా ఆధునికీకరణ పనులు



హార్సిలీహిల్స్‌పై నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సీఈ నరసింహారావు

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై చేపట్టిన పర్యాటక అతిథి గృహాల ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేసి అప్పగించాలని పర్యాటకశాఖ చీఫ్ ఇంజినీర్ వై.నరసింహారావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం ఆయన కొండపై జరుగుతున్న 12 అతిథి గృహాల పనులను పరిశీలించారు. పనులు ప్రారంభించి ఆరునెలలు గడుస్తున్నా ఇంకా పూర్తి చేసి భవనాలను అప్పగించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా యాత్రి నివాస్ భవనాలను సిద్ధం చేసి అప్పగించాలని ఆదేశించారు. మిగిలిన వాటిని సంక్రాంతిలోపు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌పై రూ.9.13 కోట్లతో పర్యాటకశాఖ అతిథి గృహాల ఆధునీకరణ, కొత్త భవనాల నిర్మాణం పనులను కాంట్రాక్టు సంస్థకు అప్పగించామని తెలిపారు. అనంతరం ఆయన పర్యాటక శాఖ అతిథి గృహాలను పరిశీలించారు. టెంట్ హౌస్‌లను పరిశీలించి వాటికి చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఈఈ సుబ్రమణ్యంరాజు, డీఈఈ శ్రీనివాసులు, మేనేజర్ నేదురుమల్లి సాల్మోన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యమ బాట

- కూటమి సర్కారు నిర్లక్ష్యంపై అన్నదాత ఆందోళన
- సూపర్ సిక్స్ హామీల కోసం ప్రజల ఎదురుచూపు
- ఆరు నెలలైనా అమలు చేయని వైనం
- రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ ద్వారా ఇవ్వాల్సిన నిధులు

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం

జిల్లాలో అర్హులు	2,03,374
కేటాయించాల్సిన నిధులు	రూ.406.74 కోట్లు



రబీ సీజన్‌లో వాడుముఖం పట్టిన వేరుశనగ పంట



సాక్షి రాయచోటి : కూటమి సర్కారు నయవంచనకు పాల్పడుతోంది. ఎన్నెన్నో హామీలు.. మరెన్నో ఆశలు రేకెత్తించి.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తోంది. సూపర్ సిక్స్ పేరుతో అధికార పగ్గాలు చేపట్టి ఆరు నెలలైనా.. పూర్తి స్థాయిలో పథకాల అమలుకు చర్యలు చేపట్టలేదు. అదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గతంలో అధికారం చేపట్టిన నాటి నుంచే అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఎక్కడ చూసినా పేదలకు సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా అడుగులు ముందుకు పడ్డాయి. రైతులకు సంబంధించి రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, వ్యవసాయానికి సబ్సిడీపై పరికరాల సరఫరా, ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి ఎన్నో పథకాల ద్వారా వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. కానీ కూటమి సర్కారు రైతులకు చెప్పిన మేరకు కనీసం ఖరీఫ్, రబీల్లో పెట్టుబడి సాయం కూడా చేయని పరిస్థితిని చూసి.. చంద్రబాబు మాటలు నీటిమీద రాతలని రైతులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

సూపర్ ఫ్లాప్

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక, మద్యం పాలసీ, నిరుద్యోగులకు డీఎస్సీ, సూపర్‌సిక్స్ పథకాలు అన్నప్పటికీ.. సూపర్ ఫ్లాప్‌గా ముందుకు సాగుతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టి ఆరు నెలలు దాటింది. కానీ సామాన్యుడికి మాత్రం ఒరిగిందేమీ లేదని చెప్పవచ్చు. ఎందుకంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నుంచే.. ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చెప్పిన పథకాలన్నీ నెరవేర్చేందుకు సంకల్పించింది. దీంతో ప్రజలకు వర్గాల వారీగా కేటాయించిన సంక్షేమం నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యే పరిస్థితి ఉండేది. కానీ నేడు నిరుద్యోగులకు భృతి లేదు.. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం లేదు.. నిరుద్యోగులకు డీఎస్సీ కనిపించడం లేదు.. అన్నదాత సుఖీభవ అడ్రస్ లేదు.. ప్రతి మహిళకు రూ.1500 ఎప్పుడిస్తారో తెలియదు.. ఇలా చెబుతూపోతే ఒకటి, అర తప్ప అన్ని హామీలు విస్మరించడం ఆందోళన కలిగించే పరిణామం.

అధికార పార్టీ నేతలకు ఆర్థిక భరోసా

సర్కారు ఉచిత ఇసుక పేరుతో రీచ్‌లను టెండర్ల పేరుతో.. కూటమి నేతలకే అప్పగించి ఆర్థిక భరోసా కల్పించారు. ఇదే అదునుగా వారు సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. పేరుకు ఉచితమైనా.. అధికంగా వసూలు చేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. కూటమి నేతలు మాత్రం రాత్రికి రాత్రే దర్జాగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గత ఎన్నికల తర్వాత ఎక్కడికక్కడ ఇసుక పాయింట్ల వద్ద ఉన్న వేల టన్నుల ఇసుకను కూడా మాయం చేశారు. జిల్లాలో మద్యం షాపులకు సంబంధించి కూడా దాదాపుగా అధికార పార్టీ నేతలకే దక్కాయి. ఒకవేళ వైఎస్సార్‌సీపీ నాయకులకు వచ్చినా.. భయపెట్టి బలవంతంగా లాక్కున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

> **ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి**
>
> 
>
> కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించింది. అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయాన్ని అటకెక్కించింది. రబీ సాయం ఊసే ఎత్తడం లేదు. సున్నా వడ్డీ రాయితీ జాడ లేదు. ఇటీవల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఉచిత పంటల బీమా అమలు చేయాలి. రైతుల కోసం వైఎస్సార్‌సీపీ చేపట్టే ధర్నాకు జిల్లాలోని రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. - ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లలో రైతులకు అందిన సాయం

ప్రభుత్వ పథకం	లబ్ధిదారులు	లభించిన మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	207176	1315.23
సున్నా వడ్డీ పంట రుణాలు	150397	34.20
ఉచిత పంటల బీమా	196285	11.10
ఇన్‌పుట్ సబ్సిడీ	97018	64.19

రైతులకు ఏదీ సాయం?

అన్నదాతలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా ఖరీఫ్‌నకు ముందు.. మే నెలలో పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులు అందించేవారు. పంట సాయంగా ఉపయోగపడుతుందని ప్రభుత్వం రైతులకు కొంత సొమ్ము అందించి, తర్వాత రబీలో మిగతాది చెల్లించేది. అంతేకాకుండా ఉచిత పంటల బీమాకు రైతుల తరఫున ప్రీమియం చెల్లించడంతోపాటు సున్నా వడ్డీ రుణాలు అందిస్తూ బాసటగా నిలిచింది. ఏ పంటకు ఆ పంట సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆపద కాలంలో ఆపద్బంధువుగా మారింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఇప్పటి వరకు రైతులకు సంబంధించిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ ఈ ఏడాది అందించలేదు. కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసినా.. రాష్ట్ర సర్కారు మాత్రం అటువైపు అడుగులు వేయలేదు. పైగా ఉచిత పంటల బీమా స్కీమ్‌ను ఎత్తివేసి రైతులే ప్రీమియం మొత్తం చెల్లించుకోవాలని నెత్తిన భారం మోపింది. ఏది ఏమైనా సర్కార్ మొద్దు నిద్ర వీడడం లేదు.

వైఎస్సార్‌సీపీ పోరు



ప్రభుత్వ తీరును ఎండగడుతూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కనున్నాయి. జిల్లాలోని నలుమూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం ప్రారంభం కానుంది. అనంతరం జిల్లా కలెక్టర్‌కు రైతులకు న్యాయం చేయాలంటూ వైఎస్సార్ సీపీ నేతలు వినతిపత్రం అందించనున్నారు.

డిమాండ్స్

- తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలి. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి.
- ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలి. దళారీ వ్యవస్థను తొలగించాలి. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలి.
- ఉచిత పంటల బీమా పునరుద్ధరించాలి. రైతుపై అదనపు భారం మోప వద్దు.

మెడికల్ సీట్లు అంతే..



నిలిచిపోయిన కళాశాల భవన నిర్మాణం

వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు రూ.380 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాల నిర్మించాలని తలపెట్టారు. ముందుగా కళాశాల భవనాలను చూసి ఈ ఏడాది తరగతులు ప్రారంభించాలని సంకల్పించారు. అయితే కూటమి అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. మెడికల్ కళాశాల ప్రారంభించకపోగా.. కేటాయించిన 50 సీట్లను కూడా ఇక్కడికి రాకుండా తరలించుకుపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. జిల్లా కేంద్రమైన రాయచోటిలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

జడివాన

రాయచోటి : జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం తెల్లవారుజామున నుంచి ప్రారంభమైన వర్షపు జల్లులు రాత్రి వరకు ఏకధాటిగా కురిశాయి. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట, పీలేరు, కెవి పల్లి తదితర మండలాల్లో వర్షపాతం అధికంగా నమోదైంది. జిల్లాలో శుక్రవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీటర్లు)	మండలం	వర్షపాతం (మి.మీటర్లు)
		గాలివీడు	23
		నందలూరు	22
రైల్వేకోడూరు	84	వాల్మీకిపురం	20.6
ఓబులవారిపల్లి	54	గుర్రంకొండ	19.4
చిట్వేలి	42.4	రాయచోటి	19.2
కెవి పల్లి	33.8	కురబలకోట	17.2
పీలేరు	33.4	వీరబల్లి	16.6
పుల్లంపేట	31.4	పెద్దమండెం	16
పెనగలూరు	30.6	మదనపల్లి	15.2
కలికిరి	29.2	రామసముద్రం	14.8
చిన్నమండెం	28.2	తంబళ్లపల్లి	12
రాజంపేట	28	ములకలచెరువు	11
కలకడ	27.8	రామాపురం	8.6
సుండుపల్లి	26.4	లక్కిరెడ్డిపల్లి	7.8
నిమ్మనపల్లి	23.6	బి.కోట	7

అసభ్యంగా ప్రవర్తించాడనే హత్య

- మనవరాలిపై తాత అనుచిత ప్రవర్తన
- పాప తండ్రి గల్ఫ్ నుంచి వచ్చి.. చంపేసి..
- సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



హత్యకు గురైన గుట్ట ఆంజనేయులు (ఫైల్)

ఓబులవారిపల్లె : మనవరాలి వరుస అయిన ఓ బాలికపై.. వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న తండ్రి గల్ఫ్ నుంచి వచ్చి అతన్ని సినీ ఫక్కీలో హత్య చేశాడు. తిరిగి వెంటనే గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అయితే ఆ హత్య తానే చేశానని ఒప్పుకొంటూ.. సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేయడం సంచలనంగా మారింది. ఈ హత్యోదంతానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త మంగంపేట పునరావాస కాలనీ పదో వీధిలో శనివారం గుట్ట ఆంజనేయులు(59) అనే దివ్యాంగుడు దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. హత్య చేసింది అయ్యలరాజుపల్లె దళిత వాడకు చెందిన జెడ్డా ఆంజనేయ ప్రసాద్‌గా నిర్ధారించుకున్నారు. గ్రామంలో పోలీసులు విచారణ చేయడం, ఇతర గొడవలు, కుమార్తె పట్ల సొంత బంధువు వ్యవహరించిన తీరు వల్లే హత్య జరిగిందని పోలీసులకు క్లూ దొరకడంతో.. కువైట్‌లో ఉన్న జెడ్డా ఆంజేయప్రసాద్ విషయం తెలుసుకొని తనే హత్య చేశానని సామాజిక మాధ్యమాల్లో వీడియోను విడుదల చేయడం వైరల్‌గా మారింది.

గతంలో..

జెడ్డా ఆంజనేయప్రసాద్ తన భార్య చంద్రకళతో కలిసి బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లాడు. తన 12 ఏళ్ల కుమార్తెను కొత్త మంగంపేటలోని చంద్రకళ చెల్లెలు లక్ష్మి, వెంకటరమణ దంపతుల వద్ద వదిలి వెళ్లారు. లక్ష్మి మామ దివ్యాంగుడైన గుట్ట ఆంజనేయులు వరుసకు మనవరాలు అయిన ఆ 12 ఏళ్ల పాపపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో కువైట్‌లో ఉన్న ఆంజనేయప్రసాద్ భార్య చంద్రకళ అదే పనిగా ఇండియాకు వచ్చి సొంతూరైన ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో వెళ్లి ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు అంతగా పట్టించుకోకపోవడం, దివ్యాంగుడిని పిలిచి మందలించి పంపడంతో ఒకింత ఆంజనేయప్రసాద్ కుటుంబం మనసు నొచ్చుకుని ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకున్నారు. దివ్యాంగుడు బయట తిరుగుతూ కవ్వింపు చర్యలతో అందరికీ ఫోన్లు చేస్తూ ఏమీ చేయలేరని చెప్పుకుంటున్న తరుణంలోనే.. ఆంజనేయప్రసాద్ కుటుంబం దివ్యాంగుడు గుట్ట ఆంజనేయులును అంతమొందించాలని వ్యూహం రచించి పథకం ప్రకారమే హత్య చేసినట్లు సమాచారం.

చెన్నైలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆంజనేయప్రసాద్‌కు పోలీసులు ఫోన్ చేసి లొంగిపోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట ఆయన విడుదల చేసిన వీడియో కూడా సంచలనంగా మారింది. పోలీసులు నిందితుడిగా భావిస్తున్న ఆంజనేయ ప్రసాద్ దంపతులను గురువారం చెన్నై ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని జిల్లాకు తీసుకువచ్చి పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలియవచ్చింది.

ఎస్‌ఐ ఏమంటున్నారంటే...

ఓబులవారిపల్లె ఎస్‌ఐ మహేష్‌ను ఈ విషయమై 'సాక్షి' అడగగా.. కేసు నుంచి తప్పించుకునేందుకే ఆంజనేయ ప్రసాద్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడని తెలిపారు. చాలా రోజుల నుంచి కుటుంబ కలహాలు ఉన్నాయని, పాప విషయంలో పోలీస్‌స్టేషన్‌లో తల్లి కేసు పెట్టకుండానే కువైట్ వెళ్లిపోయిందని పేర్కొన్నారు. న్యాయం జరగలేదనిపిస్తే పై స్థాయి అధికారులు చాలా మంది ఉన్నారని, వారికి ఫిర్యాదు చేసి ఉండాల్సిందన్నారు. అంతేగానీ హత్య చేయడం ఏమిటని.. ఇది నేరం అవుతుందన్నారు.

వీడియోతో కలకలం




నిందితుడు ఆంజనేయ ప్రసాద్

కువైట్‌లో ఉంటూ ఇక్కడికి వచ్చి హత్య చేసి అనంతరం మళ్లీ కువైట్ వెళ్లినట్లు చేసిన వీడియో సంచలనంగా మారింది. కుమార్తెను అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో తుద ముట్టించాలని నిర్ణయించుకుని హత్య చేసినట్లు ఆంజనేయప్రసాద్ యూట్యూబ్‌లో పెట్టిన వీడియో కలకలం రేపింది. హత్య చేయాలని నిర్ణయించుకుని కువైట్ నుంచి ఇక్కడికి వచ్చి.. కొత్త మంగంపేటలో నిద్రిస్తున్న గుట్ట ఆంజనేయులు తలపై బలంగా కొట్టడంతో చనిపోయాడని.. హత్య చేసి తిరిగి కువైట్‌కు వెళ్లి పోయినట్లు వీడియోలో స్పష్టం చేశాడు. తన కూమార్తెకు జరిగిన అన్యాయాన్ని జీర్ణించుకోలేక హత్య చేశానని, తాను స్వచ్ఛందంగా పోలీసులకు లొంగి పోతానని సోషల్ మీడియాలో ఆంజనేయ ప్రసాద్ పోస్టు చేశాడు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

- నోటిఫికేషన్ జారీ
- 14న అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక
- ఏకగ్రీవం కోసం అధికార పార్టీ నాయకుల యత్నాలు



రాయచోటి : జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల సందడి మొదలైంది. రెండు దఫాలుగా వాయిదా పడుతూ వచ్చిన ఎన్నికలకు ఎట్టకేలకు నోటిఫికేషన్ జారీ అయింది. జిల్లాలో కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం గెజిట్ విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఈ విషయాన్ని జిల్లా నీటి పారుదలశాఖ అధికారి భరత్ ధ్రువీకరించారు. ఈ నెల 14న సాగునీటి వినియోగదారుల సంఘాలకు కమిటీల ఎంపిక జరగనుంది. ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 3, 4 గంటలకు పూర్తి అయ్యేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వెలిగల్లు, ఝరికోన, శ్రీనివాసపురం ప్రాజెక్టుల ఎన్నికల ప్రక్రియ పూర్తికాక పోవడంతో ఎన్నికలు నిర్వహించడం లేదని జేసీ తెలిపారు. అలాగే అన్నమయ్య, పింఛా ప్రాజెక్టుల మరమ్మతుల కారణంగా ఎన్నికల నిర్వహణ చేపట్టడం లేదన్నారు. ఇదిలా ఉండగా మిగిలిన 167 సంఘాల ఎన్నికల నిర్వహణ కోసం జలవనరులు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వం సిద్ధం చేశాయి. ఇప్పటికే ఆయకట్టు రైతులకు సంబంధించిన ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. క్షేత్రస్థాయిలో ఏ సమస్య, వివాదం తలెత్తకుండా ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆయకట్టు రైతులతో సమన్వయ సమావేశాలు సైతం నిర్వహించారు.

అధికారుల నియామకం

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు జలవనరులు శాఖ పరిధిలో డీఈఈ, ఏఈఈ, తహసీల్దార్లను ఎన్నికల అధికారి (ఈఓ), అదనపు ఎన్నికల అధికారులు (ఏఈఓ), ప్రొసీడింగ్ అధికారులుగా (పీఓ) నియమించారు. వీరికి నెలరోజుల కిందట రాయచోటి, మదనపల్లి, రాజంపేట, డివిజన్లలో శిక్షణ ఇచ్చారు. తాజాగా అన్ని మండల స్థాయిలో పీఓలకు తర్ఫీదు పూర్తి అయ్యింది. జలవనరులశాఖ ఈఈ, ఆర్డీఓలను ఎన్నికల పర్యవేక్షకులుగా నియమించారు.

హైకోర్టు ఆదేశంతో రహస్య ఓటింగ్

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడైనా ఏకగ్రీవ ఎన్నిక జరగని సందర్భాల్లో చేతులెత్తి ఎన్నుకునే విధానాన్ని అనుసరిస్తే ఓటర్లు ఎవరికి ఓటు వేశారో అభ్యర్థులకు తెలిసిపోతుంది. ఇందువల్ల వారిని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ (ఎన్నికల నిర్వహణ) రూల్స్, 118 ప్రకారం చేతులెత్తే పద్ధతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. కనుక చేతులెత్తే విధానం కాకుండా రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలంటూ బెల్లన జగన్నాథం, చిరుమామిళ్ల శ్రీనివాసరావు హైకోర్టులో ఇటీవల రిట్ పిటీషన్లు దాఖలు చేశారు. 2020 నాటి లక్ష్మిసింగ్, ఇతరులు వర్సెస్ రేఖాసింగ్ ఇతరులు కేసులో రహస్య ఓటింగ్ అనేది రాజ్యాంగ పరమైన ప్రజాస్వామ్యంలో కీలకమైనదంటూ అపెక్స్ కోర్టు తన తీర్పులో స్పష్టం చేసిన విషయాన్ని కూడా పిటీషనర్లు పేర్కొన్నారు. ఈ పిటీషన్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్, రవి చీమలపాటి న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి వెళ్లింది. ఏకాభిప్రాయం కుదరని చోట రహస్య బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకుంటామనే రైతులను.. అందుకు అనుమతించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఏకగ్రీవాల కోసం..

సాగునీటి సంఘాల ఎన్నికల సభ్యులు, చైర్మన్ల ఎంపికను అధికార పార్టీ నాయకులు ఏకగ్రీవం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని సాగునీటి సంఘాలకు తమ పార్టీ అనుయాయులకే కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. దీంతో అన్నమయ్య జిల్లా పరిధిలోని సాగునీటి సంఘాలన్నీ ఏకగ్రీవం కానున్నాయన్న వార్తలు దావనంలా వ్యాపిస్తున్నాయి.

'తెలుగు' వికాసానికి బ్రౌన్ విశేష కృషి



సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, అతిథులు, నిర్వాహకులు

కడప కల్చరల్ : తెలుగు భాష వికాసానికి బ్రౌన్ విశేష కృషి చేశారని వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం 'తెలుగు సూర్యుడు' సీపీ బ్రౌన్ 141వ వర్ధంతి సభను గురువారం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. తొలుత అతిథులతో కలిసి రాజీవ్‌మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, అనంతరం గ్రంథాలయంలోని బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ 19వ శతాబ్దంలో బ్రౌన్ గనుక లేకుంటే తెలుగుభాష పరిస్థితి మరోలా ఉండేదన్నారు. సభాధ్యక్షులు, వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథ రెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ తండ్రి డేవిడ్ బ్రౌన్ బహుభాషావేత్త అని, ఆయన ప్రభావంతోనే సి.పి.బ్రౌన్ గ్రీకు, లాటిన్, ఫ్రెంచి, సంస్కృతం మొదలైన భాషలెన్నో నేర్చుకున్నారన్నారు. గౌరవ అతిథి, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ , బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ బ్రౌన్ జీవిత విశేషాలను, సాహితీసేవను, బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణం వెనుక ఉన్న జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సీకే సంపత్ కుమార్ మొదలైన ప్రముఖుల కృషిని సభకు వివరించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి సభను పర్యవేక్షించారు. వ్యాసరచన, వక్తృత్వం, పద్యపఠన పోటీలలో విజేతలైన విద్యార్థులకు వీసీ అతిథులతో కలసి బహుమతులు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ పొదిలి నాగరాజు, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, కె.రాజారెడ్డి, వరలక్ష్మిలను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు- తులనాత్మక అధ్యయన విభాగం అధ్యాపకులు జి.బాలసుబ్రహ్మణ్యం, విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యాపకులు టి.రామప్రసాద రెడ్డి, పి.రమాదేవి, వినోదిని, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ ఆత్మహత్య


రాజశేఖర్ (ఫైల్)

రాజంపేట : మండల పరిధిలోని ఆకేపాడు నవోదయ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ రాజశేఖర్ (37) కుటుంబ కలహాలతో గడ్డిమందు తాగాడు. చికిత్స నిమిత్తం సంబంధీకులు బుధవారం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం మధ్యాహ్నం పరిస్థితి విషమంగా మారడంతో కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మన్నూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేశారని చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, ప్రాంతీయ వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ స్పష్టం చేశారు. ఇది ఇలా ఉండగా సోషల్ మీడియాలో ఆటో డ్రైవర్ ఆత్మహత్యపై ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో మృతుడి భార్యను పిలిపించి వివరాలు సేకరించి పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు


మట్టిలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

సుండుపల్లె : రాయచోటి–సుండుపల్లె ప్రధాన రహదారిలోని అనుంపల్లి వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి మట్టిలో కూరుకుపోయింది. రాయచోటి నుంచి రాయవరానికి వెళ్లే ఆర్టీసీ బస్సు అనుంపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనానికి దారిని ఇచ్చే క్రమంలో డ్రైవర్ బస్సును ఒకవైపు రోడ్డుపైకి దించగా వర్షానికి మట్టిలో కూరుకుపోయింది. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రాయచోటి నుంచి సుండుపల్లికి వెళ్లే రహదారిలో అక్కడక్కడా సింగిల్ రోడ్లు ఉండటంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి భద్రతపై శిక్షణ, అవగాహన

రామాపురం : మండలంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం మండలంలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొని రహదారి భద్రతపై చర్చించారు. లక్కిరెడ్డిపల్లె సీఐ రవీంద్రబాబు, రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి మాట్లాడారు.

ఇదేం రాజకీయం.!

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పచ్చ డ్రామా
- అడుగులకు మడుగులొత్తుతున్న పోలీసు, రెవెన్యూ యంత్రాంగం
- ప్రతిపక్ష పార్టీలు పోటీ చేయకుండా కుట్రలు, కుతంత్రాలు
- నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా వీఆర్‌ఓలపై తీవ్ర ఒత్తిడి
- రేపు ఎన్నికల నేపథ్యంలో కొత్త నాటకానికి తెరతీసిన అధికార పార్టీ
- అధికార పార్టీ వికృత చేష్టలపై విస్తుపోతున్న జనం



సాక్షి కడప/సాక్షి ప్రతినిధి కడప : ఎన్నికలు ఏవైనా అధికార పార్టీ కైవసం చేసుకునేందుకు కొత్త ఎత్తుగడలకు తెర తీస్తోంది. ఎలాగైనా సొంతం చేసుకోవాలన్న తలంపుతో...అధికార బలంతో అడ్డంగా ముందుకు వెళుతున్నారు. ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన నాయకులకు అర్హతలు ఉన్నా.. అనర్హతల కింద పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని వాడుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కేవలం అధికారంలో ఉన్నామన్న అహంతో పోలీసు, రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తెస్తూ తమ దారిలో పెట్టుకుని ఇతరులకు అవకాశం లేకుండా చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు సైతం ఏకపక్షంగా చేసుకునేందుకు అవసరమైన అన్ని కుట్రలను అధికార పార్టీ ప్రయోగిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్ష పార్టీకి అవకాశం లేకుండా చేసేందుకు అడ్డదారుల్లో వెళుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ప్రధానంగా ఎన్నికలకు ఒక్కరోజే సమయం ఉండడంతో నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి పచ్చ రాజకీయానికి తెర లేపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇది కాదా కుట్ర!

జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని వర్గాలు సిద్ధంగా ఉన్నాయి. కాకపోతే అధికార బలంతో ప్రతిపక్ష పార్టీ నాయకులకు సంబంధించిన మద్దతుదారుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా తెరవెనుక అధికార పార్టీ రాజకీయ బలాన్ని ఉపయోగిస్తోంది. అధికారంలో ఉన్నాం కదా అని అటు రెవెన్యూ, ఇటు పోలీసులపై తీవ్ర ఒత్తిడి చేస్తూ ఏదో ఒక రకంగా ప్రతిపక్ష పార్టీ నేతలపై అక్రమ కేసులకు పూనుకోవడం, నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా జాగ్రత్త పడటం వంటి చర్యలకు ఉపక్రమించారు. గురువారం తొండూరు మండలం ఇనగలూరు సాగునీటి సంఘానికి సంబంధించి దశరథరామిరెడ్డి అనే రైతు సర్టిఫికెట్‌కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా... వీఆర్వో స్విచ్ఛాఫ్ చేసి పట్టించుకోని పరిస్థితి నెలకొంది. వేముల మండలం గొల్లల గూడూరులో నో డ్యూ సర్టిఫికెట్ కోసం కార్యాలయానికి వెళ్లిన రైతులపై దౌర్జన్యం చేస్తూ పేపర్లు చింపివేశారు. వేంపల్లె పరిధిలోకూడా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి మనుషులు నోటీసులను చింపివేయడం, కార్యాలయాల వద్ద ఉండరాదంటూ తరిమివేయడం చూస్తే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. పోలీసులతోపాటు రెవెన్యూ, ఇతర అధికారులపై ఒత్తిడి చేయడం చూస్తే ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

మనం మాత్రమే పన్ను కట్టాలి

జిల్లాలోని వేముల మండలంలో సాగునీటి సంఘాలకు సంబంధించి కీలక నాయకుడు పంపిన సందేశం సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. అందరూ వేములలోని తన స్వగృహానికి రావాలని, మనం మాత్రమే పన్ను కట్టాలి, మన అభ్యర్థులు గెలవాలి అన్న తరహాలో పంపిన సమాచారం సంచలనంగా మారింది. ప్రతి ఊరివారు ఇక్కడికి రావాలని, అందరికీ టిఫెన్, భోజన ఏర్పాట్లు చేశామని...ఇతర ఊర్ల వాళ్లు వస్తే గుర్తు పట్టలేమని, కనుక ఎన్నిక ఉన్న గ్రామాల వారు వచ్చి నిర్ధారించాల్సి ఉంటుందని వాట్సాప్ సందేశం పంపారు. ఇప్పటికే ఇదే మండలంలో ఎన్నికలు జరగకుండా రోజుకొక రకంగా ఉద్దేశ పూర్వకంగా భయాందోళనలు సృష్టిస్తున్న నేపథ్యంలో ఈ సందేశం కాస్త సంచలనంగా మారింది. అధికారులు కనీసం ఇలాంటి వాటిపై దృష్టి సారించి ప్రశాంత ఎన్నికలు జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, లేదంటే ఎన్నికలు వాయిదా వేయాలని ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసు

పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరామర్శించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

తొండూరు : నీటి సంఘాల ఎన్నికల్లో కూడా అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి పెత్తనం చెలాయిస్తున్నారు. నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పన్నులు చెల్లించేందుకు గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు భద్రంపల్లె వెంకట్రామిరెడ్డి, ఇనగలూరు దశరథరామిరెడ్డి, భద్రంపల్లె రజనీకాంత్‌రెడ్డిలు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఇనగలూరు గ్రామ రెవెన్యూకు సంబంధించి నీటి పన్ను చెల్లించేందుకు తహసీల్దార్ రామచంద్రుడు వద్దకు వెళ్లగా ఆయన మీ గ్రామానికి సంబంధించిన వీఆర్‌ఓ వద్దకు వెళ్లి నీటి పన్నులు చెల్లించాలని సూచించారు. దీంతో అక్కడ ఆ గ్రామానికి సంబంధించిన వీఆర్‌ఓ లేకపోవడంతో అక్కడి రెవెన్యూ అధికారులతో మాట్లాడుతుండగా గొడవలు చేశారంటూ పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రవీంద్రారెడ్డి, రామమునిరెడ్డి, శివశంకర్‌రెడ్డిలతోపాటు మరికొంతమంది నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లారు. వారు విషయాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తొండూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ పెద్ద ఓబన్నతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి చెందిన భద్రంపల్లె వెంకట్రామిరెడ్డి, ఇనగలూరు దశరథరామిరెడ్డి, భద్రంపల్లె రజనీకాంత్‌రెడ్డిలు రెవెన్యూ కార్యాలయం వద్ద విధులకు ఆటంకం కలిగిస్తున్నార ఫిర్యాదు రావడంతో వారిని స్టేషన్‌కు పిలిపించామని ఎంపీకి ఎస్ఐ వివరించారు. అనంతరం నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండి ప్రశాంతంగా ఎన్నికల్లో పాల్గొని పార్టీ మద్దతుదారులను గెలిపించుకోవాలన్నారు. టీడీపీ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని చేతకాని రాజకీయం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసు నమోదు

వైఎస్సార్‌సీపీకి చెందిన భద్రంపల్లె వెంకట్రామిరెడ్డి, ఇనగలూరు దశరథరామిరెడ్డి, భద్రంపల్లె రజనీకాంత్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. గురువారం సాయంత్రం తొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద వీరు రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తుండటంతో కేసు నమోదు చేశామన్నారు.

నో డ్యూస్ సర్టిఫికెట్ వెంటనే అందించాలి

- లేదంటే గడువు పెంచేలా చర్యలు తీసుకోండి
- అలా కుదరని పక్షంలో ఎన్నికలు వాయిదా వేయండి
- కలెక్టర్‌కు కడప ఎంపీ అవినాష్‌రెడ్డి వినతి

సాక్షి కడప : జిల్లాలో ఈనెల 14న జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి నో డ్యూస్ సర్టిఫికెట్ యుద్ధ ప్రాతిపదికన అందించేలా వీఆర్‌ఓలను ఆదేశించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. అందుకు సంబంధించి గురువారం మీడియాకు లేఖ విడుదల చేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా అధికార పార్టీ నాయకులు వీఆర్‌ఓలు నో డ్యూస్ సర్టిఫికెట్లను ఇవ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. పరిస్థితి చూస్తే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంగా తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటర్లకు నీటి పన్ను చెల్లించినట్లుగా నో డ్యూస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం ఒకవైపు చెబుతుండగా, మరోవైపు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన వీఆర్‌ఓలు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోవడం చూస్తే రాజకీయ ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందన్నారు. వేముల మండలంలోని గొల్లలగూడూరు గ్రామానికి చెందిన రైతులు వీఆర్‌ఓ వద్దకు నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం వెళ్లగా అక్కడికి టీడీపీ నాయకుడు ఒకరు వచ్చి పేపర్లు చించి వేశారని, వీఆర్‌ఓతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేయించి అక్కడి నుంచి పంపివేయడం దుర్మార్గమన్నారు. ఇనగలూరు గ్రామ నీటి వినియోగదారుల సంఘం నుంచి దశరథరామిరెడ్డి అనే రైతు వీఆర్‌ఓ వద్దకు వెళ్లగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తొండూరు మండల తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి శివమోహన్‌రెడ్డి ఇంటిలోకి వెళ్లారన్నారు. వేంపల్లె మండలం గిడ్డంగిపల్లెకు చెందిన రైతులు ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకుంటే ఆ సర్టిఫికెట్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రవీంద్రనాథరెడ్డి, మండల ఇన్‌ఛార్జి మునిరెడ్డి చింపివేశారన్నారు. రైతులకు వీఆర్‌ఓలు ఏమాత్రం సహకరించకుండా అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటిస్తుంటే ఇక ఎన్నికలు నిర్వహించడం దేనికో అర్థం కావడం లేదన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన సానుభూతి పరులైన రైతులను అడ్డుకోవడం విచారకరమన్నారు. నామినేటెడ్ పదవుల్లాగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంపిక చేసుకుంటే విమర్శలు ఉండేవి కాదు కదా అని విమర్శించారు. జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలని, నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం గడువు పెంచాలని లేదంటే ఎన్నికలు వాయిదా వేయాలని ఆయన కోరారు.

నీటి పన్ను చెల్లించకుండా అడ్డుకున్న టీడీపీ వర్గీయులు

రెవెన్యూ కార్యాలయంలో కాగితాలను చించివేసిన పార్థసారథిరెడ్డి అనుచరులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : నీటి సంఘాలకు పోటీ చేసే క్రమంలో నీటి పన్ను చెల్లించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులను టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుల చేతిలోని కాగితాలను లాక్కొని టీడీపీ నాయకుడు పేర్ల పార్థసారథిరెడ్డి అనుచరులు చించివేసిన సంఘటన వేముల మండలం రెవెన్యూ కార్యాలయంలో గురువారం చోటు చేసుకుంది. ఈనెల 14వ తేదీన శనివారం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నీటి సంఘాల ఎన్నికల్లో నామినేషన్ వేయాలంటే అభ్యర్థితోపాటు బలపరిచే అభ్యర్థి కూడా నీటి పన్ను చెల్లించాలి. దీంతో గురువారం గొల్లలగూడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఈసీ మహేశ్వరరెడ్డి, గజ్జెల చంద్రశేఖరరెడ్డిలు గురువారం నీటి సంఘాల టీసీలకు పోటీ చేసే తమ మద్దతుదారుల నీటి పన్ను చెల్లించేందుకు రెవెన్యూ కార్యాలయానికి వచ్చారు. అక్కడ వీఆర్‌ఓ రమాదేవితో తమ అభ్యర్థుల నీటి పన్ను చెల్లించాలని మాట్లాడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు పేర్ల పార్థసారథిరెడ్డి అనుచరులతో రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల చేతిలో ఉన్న కాగితాలను లాక్కొని చించివేశారు. నీటి సంఘాలకు ఎవరూ పోటీవద్దని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ఈలోపు వేముల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని పార్థసారథిరెడ్డి, అనుచరులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డిలను కార్యాలయం నుంచి బయటకు పంపించి వేశారు. ఈ విషయంపై మహేశ్వరరెడ్డి ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని ఆయన తెలిపారు.

రెవెన్యూ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

వేంపల్లె పట్టణంలోని స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వేంపల్లె మండలం గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుళరెడ్డి పద్మనాభరెడ్డి, వివేకానందరెడ్డిలు నీటి సంఘం ఎన్నికల నామినేషన్ కోసం నీటి పన్ను చెల్లించేందుకు రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్లారు. రసీదులు తెచ్చుకుంటుండగా టీడీపీకి చెందిన బీటెక్ రవి అనుచరులు అక్కడికి చేరుకున్నారు. వీఆర్‌ఓ దగ్గర నుంచి వారు రసీదులను లాక్కొని చించివేసి మీరు వెళ్లిపోవాలని, నామినేషన్ వేసేందుకు వీలు లేదని బెదిరించారు.

అధికారులపై నాయకుల ఒత్తిడి

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ : మరో రెండు రోజుల్లో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులపై కూటమి నాయకులు ఒత్తిడి చేస్తున్నారని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆరోపించారు. గురువారం సాయంత్రం ఆయన ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ, డీఎస్పీ వెంకటేశ్వరరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నోడ్యూస్ సర్టిఫికెట్ వీఆర్‌ఓలు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. పెద్దముడియం, మైలవరం, జమ్మలమడుగు మండలాలకు సంబంధించి వీఆర్‌ఓలకు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారన్నారు.

పంచాయతీ నిధులపై విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ ఆ గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి గత వారం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ ఖాదర్ వలీ గురువారం విచారణ చేపట్టారు. అందుకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం డీఎల్‌పీఓ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగాయంటూ స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టామన్నారు. నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేస్తామన్నారు. అనంతరం స్థానిక నాయకులు జై చంద్రారెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కొందరు వ్యక్తులు ఇలా చేస్తున్నారని తెలిపారు. ఎక్కడా పంచాయతీ నిధులు దుర్వినియోగం చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, రూరల్ సీఐ వరప్రసాద్, సుండుపల్లి, వీరబల్లి, సంబేపల్లి ఎస్ఐలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య


శివశంకర్ (ఫైల్)

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన సానే శివశంకర్(30) బుధవారం మద్యం మత్తులో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు సానే శివశంకర్‌కు రెండేళ్ల క్రితం కడపకు చెందిన అక్క కూతురు రోహిణితో వివాహమైంది. తనకు ఇంత వరకు పిల్లలు లేరని బాధపడేవారు. దీనికితోడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఇతను తరచూ అక్కడక్కడా అప్పులు చేసేవాడు. రోజు మాదిరే బుధవారం రాత్రి కూడా మద్యం తాగి రావడంతో తండ్రి మందలించాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొద్దుపోయాక కూడా ఇంట్లో నుంచి బయటికి రాకపోవడంతో తలుపును పగలగొట్టి చూడగా అప్పటికే శివశంకర్ మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, అమ్మ, నాన్న ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భోజనశాల, ఆర్‌ఓ ప్లాంట్ల వద్ద పరిశుభ్రత పాటించాలి

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో భోజనశాల, ఆర్‌ఓ ప్లాంట్ల వద్ద పరిశుభ్రత పాటించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయ కుమార్ డైరెక్టర్ కుమార స్వామి గుప్తాకు సూచించారు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని పత్రికల్లో వార్తలు రావడంతో గురువారం ఆయన ట్రిపుల్ ఐటీని సందర్శించారు. అనంతరం ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సండ్రలతో కలిసి భోజనశాల, ఆర్‌ఓ ప్లాంట్, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు భోజన శాలలో పాత్రలు, మంచినీరు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. క్యాంపస్‌లోని ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల అస్వస్థత గురించి ఆరా తీశారు. అలాగే విద్యార్థులతో మాట్లాడారు. రెండు నెలలుగా క్యాంపస్‌లో క్యాంటీన్లు, స్టాల్స్ ఎత్తివేశారని అవి త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు. వారంలోపు క్యాంటీన్లు, స్టాల్స్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, అకడమిక్ డీన్ వెంకటేష్, క్యాంపస్ మెయింటెన్ అధికారి అనిల్ కుమార్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూటమి నాయకుని బోటు స్వాధీనం

జమ్మలమడుగు రూరల్ : పర్యాటక ప్రాంతమైన మైలవరం జలాశయంలో ఎలాంటి అనుమతులు లేకుండా తిరుగుతున్న గండికోట గ్రామానికి చెందిన ఎన్‌డీఏ కూటమి నాయకుడి బోటును స్వాధీనం చేసుకున్నట్లు మైలవరం జలాశయం అధికారులు తెలిపారు. గురువా రం సిబ్బందితో కలిసి బోటు తిరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి బోటును జలాశయం నుంచి గట్టుకు తీసుకొచ్చారు. డ్రైవర్‌ను విచారించగా ఎలాంటి అనుమతులు లేవని తెలిసింది. దీంతో జలాశయం అధికారులు స్వాధీనం చేసుకుని తమ ఆధీనంలో ఉంచుకున్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం కొత్తసంగటిపల్లె గ్రామ పంచాయతీలోని రేపల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రాతి విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం ధ్వంసం చేసిన విగ్రహాన్ని గమనించిన స్థానిక టీడీపీ నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని సీఐ చల్లనిదొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిలు పరిశీలించారు. పోలీసులు పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

బొలేరో వాహనం ఢీకొని వృద్ధుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామసుబ్బారెడ్డి

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం వై.కొత్తపల్లె గ్రామ సమీపంలోని చవ్వారిపల్లె క్రాస్ వద్ద గురువారం ఉదయం బొలేరో వాహనం ఢీకొట్టడంతో కొక్కంటి రామసుబ్బారెడ్డి (73) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ తులసీ నాగ ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి గురువారం ఉదయం పొలం వద్దకు టీవీఎస్ వాహనంపై వెళుతుండగా చవ్వారిపల్లె క్రాస్ రోడ్డు వద్ద లావనూరు నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రామసుబ్బారెడ్డికి తీవ్ర గాయాలై దుర్మరణం చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన ఆకేపాటి ఒంటిమిట్ట పాదయాత్ర


ఒంటిమిట్ట రామయ్య క్షేత్రంలో ఆకేపాటితో మాజీ డిప్యూటీ సీఎం, కమలాపురం మాజీ ఎమ్మెల్యే, కడప మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

ఒంటిమిట్ట : అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి 22వ తిరుమల మహా పాదయాత్ర ముగించుకొని చేపట్టిన ఒంటిమిట్ట పదవ మహా పాదయాత్ర ఘనంగా ముగిసింది. గురువారం ఆకేపాడులోని దేవాలయ సముదాయం నుంచి ఎమ్మెల్యే ఆకేపాటి ఒంటిమిట్ట వరకు పాదయాత్ర చేశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి తదితరులు సంఘీభావం ప్రకటించారు. మండల పరిధిలోని మంటపంపల్లి వద్ద జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా ఆకేపాటి పాదయాత్ర కొనసాగించారు. అలాగే వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆయన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి స్వామివారికి తలనీలాలు సమర్పించారు. అనంతరం బాలాలయంలో ఉన్న సీతారామ లక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యానశాఖ మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, ఒంటిమిట్ట, రాజంపేట, నందలూరు, సిద్దవటం మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 145ను రద్దు చేయండి


జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న న్యాయవాదులు

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో కోర్టులను తగ్గించేందుకు తీసుకొస్తున్న జీఓ నంబర్ 145ను రద్దు చేయాలని రాయచోటి కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ ప్రజల ముగ్గింట్లోకి న్యాయం చేరేలా న్యాయవ్యవస్థ అభివృద్ధి చెందాలని దేశ అత్యున్నత న్యాయస్థానం చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇలా కొత్త జీఓలు తీసుకొచ్చి న్యాయ వ్యవస్థలను లేకుండా చేయాలనుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, భాతర న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు టి. ఈశ్వర్, సీనియర్ న్యాయవాదులు రాజకుమార్ రాజు, ధనుంజయ కుమార్, చిన్నయ్య, రామాంజులు, మిఠాయి ఖాదర్ బాషా, వరలక్ష్మి, ఆనంద్, ఉత్తజీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సభకు ఉద్యోగుల పయనం


బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (జగదాంబసెంటర్) : ఈ నెల 13న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనే స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమానికి గురువారం జిల్లా నుంచి ప్రత్యేక బస్సుల్లో ఉద్యోగులు బయలుదేరి వెళ్లారు. బస్సులను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జెండా ఊపి ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు, ఆదర్శ రైతులు 310 మంది ఏడు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ నాగభూషణం, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.